# బహుమతి

మంజుల గుమ్మం దాటి ముందుగదిలోకి వెళ్ళేటప్పటికి సుష్మ కుర్చీమీద నిల్చునివుంది. అక్కయ్య పడిపోకుండా పదేళ్ళ సుష్మ తమ్ముడు కుర్చీని కదలకుండా పట్టుకునివున్నాడు.

సుష్మ కుడిచేతిలోని ఎలక్ట్రిక్ బల్బుని హోల్డర్‌లోకి అమరుస్తోంది.

"హలో రచయిత్రిగారు, పన్లోవున్నట్లున్నారు." అన్నది మంజుల చిరుదరహాసంతో.

బల్బుని అమర్చి, కుర్చీమీదనుంచి కిందకి దూకింది సుష్మ. లైట్‌స్విచ్ వేసి, బల్బు వెలగటం గమనించి తృప్తిగా మళ్ళీ లైట్ ఆర్పేసింది

"బల్బు మాడిపోయిందే. ఫిలమెంట్‌ని దగ్గరిగా కదిపి అమర్చాను. వెలిగింది. మళ్ళ కొత్తబల్బు కొనక్కర్లేదు. ఏమిటిలా దయచేశావ్!" అడిగింది మంజులని.

"ఆదివారం. ఈ ఒక్కరోజేగా నేను ఫ్రీబర్డ్‌ని. ఏం సినిమా చూపిస్తావ్ ఈరోజు?"

"సినిమానా? ఈ నెల నాకోటా అయిపోయింది. నాకే గతిలేకపోతే నిన్నెక్కడ తీసుకువెళ్లేది?" సుష్మ కుర్చీని యధాస్థానంలోకి మారుస్తూ అన్నది.

"మా అక్క మొన్ననే వెళ్ళిందిసినిమాకి. మా అమ్మ మళ్ళీ డబ్బివ్వదు నెలదాకా" సుష్మ తమ్ముడు చెప్పాడు మంజులకి.

మంజుల కుర్చీలోకూర్చుని ఓసారి గదివంకచూసి అన్నది. ఖాళీగావుంది పడకకుర్చీ.

"మీ నాన్నగారేరి?"

"భట్టిప్రోలు వెళ్ళారు"

"దేనికి? నీకేమయినా పెళ్ళిసంబంధం చూస్తోందా మీ బామ్మ?"

"ఛ. నీకెప్పుడూ పెళ్ళిగోడవే...

మాబామ్మకి సుస్తీచేస్తే వెళ్ళారు చూడటానికి. మూడురోజులయింది. ఇంకా ఏకబురూ తెలియలేదు మా అమ్మ వెళ్ళగానే వుత్తరం రాయిస్తానందికూడా."

"నాకు తెలీదే! అయితే నువ్వూ మీతమ్ముడూ ఇద్దరేవున్నారా ఇంట్లో?"

"మా అన్నయ్యకూడా వున్నాడు."

"అయితే మీఅమ్మకి తెలియదులే మనం సినిమాకి చెక్కేద్దాం. 'లాఫింగ్ ట్వెంటీస్ లో లారెల్ ని చూడ్డానికయినా వెళ్ళాలి"

"నేను మీ హాస్టల్ కి వద్దామనుకుంటున్నాను. సాయంత్రందాకా కబుర్లుచెప్పుకొని, ఎంచక్కా దగ్గిరేవున్న రామకృష్ణాబీచ్ కి వెళ్ళి...

"మాట మార్చొద్దు. బయట మేట్నీ ప్లస్ లంచ్."

"ఐయామ్ సారీ మంజుల! ఈసారికి వదిలెయ్."

"సరే. గీతలుగీయి. అష్టా చమ్మా ఆడుదాం'' కొద్దిగా కోపంగా! అంది మంజుల.

"చాల్లే.'' సుష్మ చిన్నగా నవ్వుతూ అంది.

"కాస్త కాఫీ ఇస్తావా?''

"ష్యూర్'' లోపలికినడిచింది సుష్మ.

"ఆగు. గేస్ స్టవ్ నేను వెలిగిస్తాను.

మాహాస్టల్ లో కుదరదు. ఇక్కడయినా ఆ సరదా తీర్చుకోని. నిప్పుతగులగానేగుప్ మంటూబలేఅంటుకుంటుంది. ఎప్పుడు ఎం.ఎ. అవుతుందో. ఎప్పుడుపెళ్ళి చేస్తారోఏమిటో?''

"డోంటాక్ రాట్ బిఫోర్ ది బాయ్'' ఇంగ్లీషులో మందలించింది సుష్మ. స్నేహితురాలు మంజులని.

కాల్ గేస్ స్టవ్ అంటించి అడిగింది మంజుల.

"కొత్తకథలు ప్రచురిస్తామని వుత్తరాలేమయినా వచ్చాయా?"

"రాలేదు. దసరాపండుగకూడా గడిచిపోతోంది ఆ సంతోషంలేకుండా."

"పోనీ"

"కథలపోటీకి చాలా మంచికథ పంపాను ఈసారి ఎదురుచూస్తున్నాను. ఎంత థ్రిల్ అలాఎదురుచూడటంలో"

"లాటరీ టిక్కెట్ కొనడంలో, జాక్‌పాట్ టికెట్ కొనడంలో, కథవ్రాసి పత్రికకి పోటీకి పంపడంలో తేడా లేనేలేదు. అంతా అదృష్టం!"

"అలా కాదు; కృషి మెరిట్ వుంటే కథల విషయంలో గెలుపు రచయితదే. లాటరీలు, రేసులు కేవలం జూదాలు సాహిత్యం జూదం కాదు."

"ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి; ఇంతకీ కథ పేరేమిటో?"

"చెప్పాగా...! చీకటి వెలుగులు!"

"బావుంది!"

"పేరా?"

"బావుందు కి మరో అర్థం కూడా వుంది."

మరో అరగంటదాకా మిత్రురాళ్ళిద్దరూ కబుర్లు చెబుతూ కూర్చున్నారు.

"వెళ్తాం..."

కేక వినపడ్డ సుష్మ గాభరాగా లేచింది.

"గుడ్ హెవెన్స్! బామ్మ కేమయినా..."

వణికే చేతులతో సంతకంచేసి టెలిగ్రాం విప్పింది. గుండెని బిగబట్టి టెలిగ్రాం విప్పింది.

'గ్రాండ్ మదర్ ఎక్స్పైర్డ్. స్టార్ట్ ఇమ్మీడియట్లీ.' అని టెలిగ్రాంలో వుంటుందనుకుంది మంజుల. కాని అలా లేదు.

సంతోషంగా కేక వేసి, మంజుల పైటకొంగు పట్టుకుని గట్టిగా లాగింది.

"ఏమిటిది! ఏమిటిది?" ఖంగారుగా అడిగింది మంజుల, సంతోషంతో వెలిగిపోతున్న సుష్మ మొహంవంక చూస్తూ.

"కొంపతీసి మీ నాన్నగారు చూసిన సంబంధం సెటిల్ చేసేశారా!

"కాదు. చూడు"

మంజుల చదివింది టెలిగ్రాం అందుకుని.

"కంగ్రాచ్యులేషన్స్. ఎవార్డెడ్ ఫస్ట్ ప్రైజ్ ఫర్ చీకటి వెలుగులు, ఎక్స్పడైట్ పాస్పోర్ట్సైజ్ ఫొటోగ్రాఫ్ విత్ డిటైల్స్ – విశ్వవాణి"

మంజుల వెంటనే చిన్నగా యీల వేసింది.

"కంగ్రాట్స్ సుష్మా కంగ్రాట్స్. అబ్బ! నీకు ఫస్ట్ ప్రైజ్...కంగ్రాట్స్. వాటె లవ్లీ సర్ప్రయిజ్."

సుష్మ మరో అరగంటదాకా నేలమీద నిలవలేక

పోయింది. గబగబా 'చీకటి వెలుగులు' కథ కాపీ బయటికి తీసి స్నేహితురాలికి చదివి వినిపించింది. ఆ కథ తనెక్కడ గొప్పగా వ్రాసింది, ఆ కథలో ఏ అంశం సంపాదకులకి, న్యాయనిర్ణేతలకి నచ్చి వుంటుంది చెప్పింది.

మంజుల లేకపోతే సుష్మ బహుశ ఎగిరి గంతులు వేసి వుండేది.

"ఎంత యిస్తారు ?" అడిగింది మంజుల.

"డామిట్. ఎంత యిస్తారన్నది కాదు ప్రశ్న. రెండు మూడువేలమంది వ్రాస్తారు. వాళ్ళలో చాలామంది చాలా మంచికథలే వ్రాసిపంపుతారు. అన్ని మంచికథల్లోంచి మనకథ తీసి ఎన్నిక చెయడం, రచయిత్రికి, దానివల్ల లభించే గౌరవం విలువకట్టలేనిదే. డబ్బుకాదు ప్రధానం, గౌరవం.

"అది సరే. ఎంత ఇస్తారు ?"

సుష్మ గబగబా చెప్పుకుపోతోంది.

"ఇవాళ ఆదివారం. ఫోటో స్టూడియో లుండవు రేపు ప్రొద్దున్నే ఫోటో తీయించుకుంటే సాయంత్రానికిస్తాడేమో అడగాలి, పోస్ట్ టైం అయ్యేలోగా."

"సుష్మ. ఓ ప్రశ్న అడగనా ?"

"అడుగు"

"నీ కథ సంపాదకునికి బాగా నచ్చి వుండచ్చుకదా మిగతా అన్ని కథలకన్నా !"

'అవును'

"అందుకే మొకటి బహుమతి ఇచ్చారు."

'అవును'

"మరో సంపాదకుడు ఆస్థానంలో వుంటే అది అతనికి అంతగా నచ్చకపోవచ్చునూ !

"న్యాయ నిర్ణేతలకి, సంపాదకునికి, ఇంత మందికి నచ్చాలి. నచ్చింది కాబట్టే వచ్చింది."

"వాళ్ళంతా వేరేవాళ్ళయి వుంటే, ఆ వేరే వాళ్ళకి నచ్చకపోవచ్చుగా ?"

"సాహిత్యంలో ప్రవేశం వున్నవాళ్ళే అక్కడ బహుమతి నిర్ణయించేది."

"అవును. అయినా ఏమిటి నీ అర్థంలేని ప్రశ్నలు ?"

"మనం కొన్న లాటరీ టిక్కెట్ నంబరుకి ప్రయిజ్ రావడం, మనం కట్టిన గుర్రం ఫస్ట్ రావటం లాంటిదే యిది అని నా నమ్మకం. దానికీ, దీనికీ తేడా ఏమిటి ?"

"నీ బొంద నువ్వు కుళ్ళుమోతు"

"నా కెందుకు ? నేను కథలు రాయనుగా అయినా"

'తెలివే...'

"మరి సినిమా, లంచ్ ..."

"నా దగ్గర డబ్బు లేదే యిప్పుడు ?"

"మీ అన్నయ్యని అడిగి తీసుకో. ఇలాంటప్పుడు మీ అన్నయ్య యిస్తాడులే; కనబడడేం?"

"ఆఫీస్‌కి వెళ్ళాడు."

"ఆది వారం కూడా ?"

"చాలా మందికి బుద్ధి లేదే. ఆదివారం యింట్లో గడపండ్రా అని శెలవ ఇచ్చినా ఆఫీసు చూరుపట్టుకొని వేళ్ళాడి. కింద పనిచేసే క్లర్కుల్ని కూడా కొప్పడి రప్పించు కుంటారు."

"మంచి ఆఫిసరే దొరికాడు రచయిత్రి అన్నయ్యకి. ఆఫీస్ దారిలో నేగా. అడిగి తీసుకుని పోదాం పద."

"షాపుకి ఏ చీర వేసుకోమంటావో చెప్పు."

సుష్మ మంజులని చెయ్యి పట్టుకొని లోపలికి లాక్కెళ్ళింది

*   *   *

సుష్మ మంజుల దారిలో డబ్బు తీసుకుని, యింటి తాళం చెవి అప్పచెప్పి అప్సర హోటల్‌కి రిక్షా మీద వెళ్లారు. అప్సరలో భోజనం చేసి, పూర్ణా మార్కెట్ దాకా నడిచి వచ్చారు.

సుష్మ దారిలో ఇద్దరుముగ్గురు స్నేహితురాళ్ళకి తనకి కథలపోటీలో ప్రథమబహుమతి వచ్చినసంగతి దాచుకోలేక చెప్పింది.

పూర్ణామార్కెట్‌నుంచి మళ్ళీ రిక్షాలో సినిమా థియేటర్‌కి వెళ్ళారు సరిగ్గా సినిమా మొదలయ్యే సమయానికి మార్కెటింగ్ పూర్తి చేసుకుని.

మంజుల సినిమాని చక్కగా చూసి, ఎంజాయ్ చేసింది కాని సుష్మ మాత్రం రాబోయే తన కథ గురించే ఆలోచిస్తూండి పోయింది.

మంజుల సుష్మని రిక్షాలో డాబాగార్డెన్స్‌లోని ప్రేమసమాజం వీధిలో దింపి, కాసేపు ఇంట్లో కూర్చొని, విమెన్స్ హాస్టల్‌కి తిరిగి వెళ్ళిపోయింది.

విమెన్స్ హాస్టల్ సముద్రానికి దగ్గరే అయినా, ఆ ప్రాంతంలో వున్న అఫిషియల్ కాలనీలో ఓ స్నేహితురాలింటికి వెళ్ళాలనుకున్నా, సుష్మ బీచ్‌కిగానీ, ఆ స్నేహితురాలింటికిగానీ వెళ్ళదలుచుకోలేదు. తన సంతోషాన్ని ఆ సందులోని వాళ్ళతో ముందర పంచుకుని తర్వాత మిగతా తెలిసినవాళ్ళందరికీ చెప్పాలనుకుంది.

"నీకు బహుమతి రావటం కాదుగాని, మా ఆఫీసరొకతున్న నువు వెళ్ళగానే వచ్చిలేశాడు. ఆయన భార్యకూడ ఏదో కథ వ్రాసిందట పోటీకి. నిన్ను పై ఆదివారం తీసుకు రమ్మన్నాడు వీలయితే" సుష్మ అన్నయ్య చెప్పాడు చెల్లెలికి మంజుల వెళ్ళినతర్వాత.

మంజుల వెళ్ళిన అయిదునిమిషాలకి ఆ సందు చివర కిళ్ళీకొట్లోవుండే కుర్రాడువచ్చి తలుపు తట్టాడు మంజుల

అన్నయ్య తలుపు తెరిచాడు. ఆ కుర్రాడు మడతపెట్టిన కాగితం అందించి పరిగెత్తాడు... పై మడతమీద 'సుష్మకి' అని తెలుగులో వ్రాసివుండటం గమనించి, ఏమిటన్నట్లుగా చూస్తున్న చెల్లెలికి అందించాడు దాన్ని.

సుష్మ ఆ వుత్తరం మడతలు విప్పింది. పెన్సిల్‌తో చింపిన వాల్ పోస్టర్ వెనక వ్రాసివుంది మంజుల చేతివ్రాత కుదురుగా.

డియర్ సుష్మ...!

థాంక్స్ ఫర్ యువర్ కంపెనీ. నీచేత ఇవాళ చాలా ఖర్చుపెట్టించాను. ఏంచేయను ? ఇంటినుంచి వచ్చే డబ్బు చాలదు. సరదాలు చావవు. అందుకే విజయవాడలో మా బావతో చెప్పి నీకు మొదటి బహుమతి వచ్చినట్లుగా టెలిగ్రాం ఇప్పించాను. విశ్వవాణి ఆఫీసువుంది విజయవాడలోనేగా మరి! నేను వచ్చాకే వస్తుందనుకున్న ఆ టెలిగ్రాం అలాగే రావటం నా అదృష్టం. నాముందే అందుకున్నావ్ దాన్ని.

నీకు ప్రయిజ్ రాలేదు డిన్నర్ కోసం, సినిమాకోసం, నీదగ్గర పుచ్చుకున్న పాతికరూపాయల అప్పుకోసం ఆ టెలిగ్రాం నేనే ఇప్పించాను.

బాగా తిట్టుకో నన్ను.

మంజుల

అన్నట్లు మర్చానే దీన్ని మీ అన్నయ్యకి చూపిస్తే నామీద ఒట్టే 'మం'

"ఏమిటదీ?" అడిగాడు సుష్మ అన్నయ్య ముఖ కవళికలు అకస్మాత్తుగా మారిపోయిన సుష్మని పరిశీలనగా చూసి.

సుష్మ అన్నయ్య చేతిలో వుంచిందా వుత్తరం. చదివాడు దాన్ని. "అరె మంజుల ఇంత అల్లరిపిల్లా. ఇంకా ఏ కోతివెధవో రాసాడనుకుంటున్నాను"

సుష్మ ఎక్కిళ్ళువిని తలెత్తిచూశాడు. రెండు చేతులతో ముఖంకప్పుకుని బలవంతంగా ఏడుపుని ఆపుకుం టోంది సుష్మ.

"ఛ! దేనికి ఏడవటం. వద్దు" సముదాయించ బోయాడు సుష్మ అన్నయ్య. కాని సాధ్యంకాలేదు.

"ఎంత సంతోషపడ్డాను. ఎంత మోసంచేసింది! ఛీ! ఛీ ఇక దీంతో స్నేహం కట్. చాలా మందికి చెప్పేశాను"

"పోన్లే."

సుష్మ అన్నయ్యకికూడా మంజులమీద కోపంవచ్చింది. కొద్దిగా అసహ్యంవేసింది,

"ఇదివరకటి ఏజ్లైతే, ఈ పాతికా ఇక తిరిగిరావు. ఇక మనగడప తొక్కదసలు ఇప్పట్లో" అన్నాడు.

సుష్మ ఏడుపు ఆపింది దాదాపు పావుగంటతర్వాత.

రాత్రి భోజనంచేయలేదు అన్నయ్య బ్రతిమాలినా. నిద్రపోబోయేముందు పాత 'విశ్వవాణి' సంచికని తీసింది చదువుదామని.

చదవలేదు కాని ఏడ్చింది.

* * *

మర్నాడు వుదయం సుష్మ అన్నయ్య కొత్తబల్బు కొని తెచ్చాడు. ఆఫీస్‌కి వెళ్ళబోయేముందు అంతకుముందు రాత్రి వెలగలేదు ఫ్యూజ్ అయిన ఆ బల్బు తమ్ముడి సహాయంతో సుష్మ కొత్తబల్బుని అమర్చింది.

తమ్ముడు స్కూల్‌కి వెళ్ళిపోయాడు. సుష్మ, అన్నా, తమ్ముళ్ళిద్దరితో సరిగ్గా మాట్లాడలేదు. ముభావంగా వుండిపోయింది. మంజూ, తప్పిపోయిన సంతోషం రెండూ గుర్తుకువచ్చి మనసు కలుక్కుమంటోంది.

'నాకు ప్రాపంలేదు' అనిసరిపెట్టుకోడానికి ప్రయత్నించి, ఆరోజు వుత్తరంకోసం ఎదురుచూసింది. తలిదగ్గరనుంచి, భట్టిప్రోలు నుంచి ఆరోజుకూడా వుత్తరంరాకపోవడం కొద్దిగా ఆందోళన కలిగించింది సుష్మకి. మాడిపోయిన ఆ బల్బు పారేసినాపోయేది పీడ ఒకవేళ మైలఅయాక రాద్దామనుకుని వ్రాయలేదా? అయితే బామ్మ...?

మరెందుకు రాయరు? ఏదో భయం.

చీకటిపడుతుండగా టెలిగ్రాం ఇచ్చే వ్యక్తిని గుమ్మంలో చూడగానే సుష్మ గుండెల్లో రాయిపడ్డట్టయింది.

టెలిగ్రాం అందుకుంది. సంతకంపెట్టకుండానేముందర చింపి చదివింది టెలిగ్రాంని, భృకుటి ముడివేసి.

'నెంబర్ 19. ఇక్కడ సంతకంపెట్టండి.

అతను చూపెట్టినచోట సంతకంపెడుతూ చెప్పింది సుష్మ అతనికి.

"నాకథకి సెకండ్ ప్రయిజ్ వచ్చింది"

—×—